క్లుప్తంగా

ఢిల్లీ వెళ్లిన ఐటీడీఏ పీఓ

సీతంపేట: సీతంపేట ఐటీడీఏ పీఓ బి.నవ్య సోమవారం ఢిల్లీ వెళ్లారు. గిరిజన సంక్షేమ శాఖ పరిధిలోని వసతిగృహాల్లో పనిచేసిన కొంత మంది తాత్కాలిక ఉద్యోగులను ఇటీవల తొలగించారు. వారు జాతీయ ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు చేయడంతో.. దీనిపై నేరుగా హాజరై వివరణ ఇవ్వాలని ట్రైబల్ వెల్ఫేర్ రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రటరీని కమిషన్ ఆదేశించింది. అయితే రాష్ట్ర శాసనసభా సమావేశాలు ఉన్నందున ప్రిన్సిపల్ సెక్రటరీ హాజరు కాలేకపోవడంతో ఆయన తరపున పీఓ ఢిల్లీ వెళ్లినట్టు ఐటీడీఏ వర్గాల సమాచారం.

నేడు మండల సమావేశం

కురుపాం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఉదయం 11 గంటలకు ఎంపీపీ శెట్టి పద్మావతి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వి.శివరామప్ప సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచ్‌లతో పాటు వివిధ శాఖలకు చెందిన అధికారులు హాజరుకావాలని కోరారు.

సారూ..పరిహారం చెల్లించరూ..



నర్సరీలో తొలగించిన మామిడి చెట్లను చూపుతున్న సుభద్రాదేవి

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని ఎస్.కే పాడు ఉద్యానవన నర్సరీ కేంద్రంలో చేపడుతున్న పర్యాటకాభివృద్ధి పనుల్లో భాగంగా కొన్ని మామిడి, కొబ్బరి చెట్లను అధికారులు తొలిగించారు. అయితే ఏడాది పాటు ఈ నర్సరీ ఫలసాయం అనుభించేందుకు బిడ్డిక సుభద్రాదేవి అనే గిరిజన మహిళ వేలాన్ని దక్కించుకుంది. అధికారులు చెట్లు తొలగించడంతో తనకు జరిగిన నష్టాన్ని పరిహారంగా చెల్లించాలని ఆమె కోరుతోంది. ఈ విషయంపై సంబంధిత ఉద్యానవన శాఖ అధికారుల వద్ద ప్రస్తావించగా.. నర్సరీలో చేపట్టబోయే అభివృద్ధి పనుల కోసం అడ్డుగా ఉండే కొన్ని చెట్లు తొలగించడం జరుగుతుందని వేలం పాట నిర్వహించే ముందు వేలంలో పాల్గొనేందుకు వచ్చిన వారందరికీ తెలియశామన్నారు. అన్నింటికీ ఒప్పుకున్నాకే వేలంలో నర్సరీని దక్కించుకున్న సుభద్రాదేవికి నర్సరీని అప్పగించడం జరిగిందన్నారు.

వైద్య శిబిరాన్ని పరిశీలించిన డీఐఓ



వైద్యశిబిరాన్ని పరిశీలిస్తున్న జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి

పార్వతీపురం టౌన్: ప్రభుత్వ జూనియర్ కళాశాల, డీవీఎం ఉన్నత పాఠశాల పోలింగ్ కేంద్రాల్లో వైద్య సిబ్బంది ఏర్పాటు చేసిన ప్రథమ చికిత్స వైద్య శిబిరాన్ని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి(డీఐఓ) డాక్టర్ టి.జగన్‌మోహన్‌రావు సోమవారం పరిశీలించారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా పోలింగ్ కేంద్రాలకు ఓటు వేయడానికి వచ్చిన ఓటర్లకు, అక్కడ నిర్వహణ సిబ్బందికి ఎటువంటి అనారోగ్య సమస్యలు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్త దృష్ట్యా వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. బీపీ, సుగర్, జ్వరం, ఆయాసం, వికారం, వాంతులు, తలనొప్పి, కడుపునొప్పి, కీళ్ల నొప్పులు, డీహైడ్రేషన్ తదితర అనారోగ్య లక్షణాలకు శిబిరంలో ఏర్పాటు చేసిన మందులను ఆయన పరిశీలించారు. ఈ వైద్య శిబిరాన్ని పలువురు వినియోగించుకున్నారని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

విత్తనగుళికల తయారీపై అవగాహన



రైతులకు విత్తనగుళికల తయారీని వివరిస్తున్న ప్రకృతి వ్యవసాయి సిబ్బంది

రేగిడి: మండలంలోని చాటాయవలస గ్రామంలో విత్తనగుళికల తయారీపై సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయం పీఆర్‌పీ సీహెచ్ శారద, గౌరీశ్వరరావు, పార్వతమ్మ విత్తనగుళికల తయారీని ప్రయోగాత్మకంగా రైతులకు వివరించారు. తొమ్మిది రకాలైన విత్తనగుళికల తయారీకి ముందు బీజామృతంతో విత్తన శుద్ధిచేసి, తర్వాత బంకమట్టి, ఘనజీవామృతం, బూడిద, సరిపడ నీరు, ఒకదాని తర్వాత ఒకటి వేసి నానబెట్టాలి. ఇలా చేసిన విత్తనాలను పొలంలో జల్లుకుంటే పంటకు పట్టే చీడపీడలు, తెగుళ్లను నివారించవచ్చన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కరణం గోవిందరావు, ఎంపీటీసీ పొగిరి అప్పలనాయుడు, ఐసీఆర్‌పీలు పైల తవిటినాయుడు, కె.రమణ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా పోలింగ్

- సజావుగా ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్
- బారులుతీరిన పట్టభద్రులు
- సాయంత్రం వరకు కొనసాగిన పోలింగ్
- పాలకొండ, కురుపాం నియోజకవర్గంలో 76.27 శాతం పోలింగ్

ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ సోమవారం ప్రశాంతంగా ముగిసింది. ఉదయం 8 గంటల నుంచి పోలింగ్ ప్రారంభమైంది. ఓటుహక్కు వినియోగించుకునేందుకు పట్టభద్రులు ఆసక్తి చూపారు. పోలింగ్ ముగిసే సమయానికి క్యూలో ఉన్న ఓటర్లందరికీ ఓటు వేసేందుకు అధికారులు అవకాశం కల్పించారు. సబ్‌కలెక్టర్ నూరుల్‌కమర్, ఇతర అధికారులు పోలింగ్ సరళిని పర్యవేక్షించారు. జిల్లా ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు, డీఎస్పీ జీవీ కృష్ణారావు నేతృత్వంలో పోలింగ్ కేంద్రాల వద్ద పోలీసులు పటిష్ట బందోబస్తు నిర్వహించారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగలేదు. పాలకొండ నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో మొత్తం ఓటర్లు 5014 మంది ఉండగా 3683 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. కురుపాం నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో 3138 మంది ఓటర్లకు గాను 2494 మంది ఓటర్లు ఓటుహక్కు వినియోగించుకున్నారు.

– సాక్షి, పాలకొండ, కురుపాం నెట్‌వర్క్



సీతంపేట: బారులు తీరిన ఓటర్లు



సీతంపేట: పోలింగ్ కేంద్రాన్ని సందర్శించిన సబ్‌కలెక్టర్ నూరుల్ కమర్



భామిని: పోలింగ్ కేంద్రం సమీపంలో శిబిరం వద్ద ఓటింగ్ సరళిపై పార్టీ నాయకులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే కళావతి

పాలకొండ, కురుపాం నియోజకవర్గాల్లో పోలింగ్ సరళి ఇలా..

మండలం	మొత్తం ఓట్లు	పోలైన ఓట్లు	ఓటింగ్ శాతం
వీరఘట్టం	1319	949	71.95
సీతంపేట	868	754	86.87
భామిని	570	446	78.25
పాలకొండ	2257	1534	67.93
జి.ఎల్.పురం	608	543	89.31
కురుపాం	582	503	86.43
జియ్యమ్మవలస	596	497	83.39
గరుగుబిల్లి	723	529	73.17
కొమరాడ	629	462	73.44
మొత్తం	8157	6217	76.21



గరుగుబిల్లి: పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ హేమలత



పాలకొండ: సిబ్బందికి సూచనలు చేస్తున్న తహసీల్దార్



పాలకొండ: పోలింగ్ కేంద్రంలో సిబ్బందికి సూచనలిస్తున్న సబ్‌కలెక్టర్ నూరుల్ కమర్



జియ్యమ్మవలస: పోలింగ్ కేంద్రం వద్ద ఓటు వేసేందుకు బారులు తీరిన పట్టభద్రులు



గుమ్మలక్ష్మీపురం: భద్రగిరి ఏపీటీడబ్ల్యూఆర్ఎస్(బాయ్స్) పోలింగ్ కేంద్రం వద్ద ఓటు వేసేందుకు క్యూలో నిల్చున్న పట్టభద్రులు



పాలకొండ: పర్యవేక్షణ చేస్తున్న డీఎస్పీ, పోలీసులు



పాలకొండ: బారులు తీరిన ఓటర్లు



భామిని: పోలింగ్ సమయం ముగిసే సరికి క్యూలో ఉన్న పట్టభద్ర ఓటర్లు



గరుగుబిల్లి: క్యూలో ఉన్న పట్టభద్ర ఓటర్లు



గుమ్మలక్ష్మీపురం: భద్రగిరి ఏపీటీడబ్ల్యూఆర్ఎస్‌లో ఓటరు స్లిప్పులు చూపుతున్న పట్టభద్రులు



కొమరాడ: ఓటు వేసేందుకు క్యూలో నిలుచున్న ఓటర్లు



కురుపాం: జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పోలింగ్ కేంద్రం వద్ద ఓటు వేసేందుకు క్యూలో ఉన్న ఓటర్లు



కురుపాం: పోలింగ్ కేంద్రం వద్ద పోలీసుల బందోబస్తు



వీరఘట్టం: పోలింగ్ కేంద్రం వద్ద ఓటేసేందుకు బారులు తీరిన పట్టభద్రులు



పాలకొండ: వీల్‌చైర్‌పై ఓటు వేసేందుకు వస్తున్న ఓటరు



వీరఘట్టం: ఓటేసిన టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ నిమ్మక జయకృష్ణ



వీరఘట్టం: సాయంత్రం 5.30 గంటల సమయంలో పోలింగ్ కేంద్రం వద్ద బారులుతీరిన ఓటర్లు



భామిని: పోలింగ్ ఏర్పాట్లపై ఆర్‌ఓను వాకబు చేస్తున్న సబ్‌కలెక్టర్ నూరుల్ కమర్, తహసీల్దార్ అప్పారావు

సజావుగా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ పోలింగ్



పోలింగ్ కేంద్రం వద్ద ఓటింగ్ సరళి పరిశీలిస్తున్న నర్సు రామారావు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, తదితరులు

పాలకొండ: స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో రాజాం, పాలకొండ నియోజకవర్గాలకు సంబంధించి స్థానిక సంస్థల ఎమ్మెల్సీ పోలింగ్ సోమవారం ప్రశాంతంగా ముగిసింది. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటలవరకు జరిగిన పోలింగ్‌లో ఎమ్మెల్యేలు కంబాల జోగులు, విశ్వాసరాయి కళావతితో పాటు ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, కౌన్సిలర్లు ఓటు హక్కును వినియోగించుకున్నారు. రెండు నియోజకవర్గాల పరిధిలో 153 ఓట్లుకు గాను 149 ఓటు పోలైనట్లు అధికారులు తెలిపారు. పాలకొండ నగరపంచాయతీలో ఒక కౌన్సిలరుతో పాటు రాజాం, సంతకవిటి, వీరఘట్టం మండలాల్లో ఒక్కొక్కరు చొప్పున ముగ్గురు ఎంపీటీసీలు ఓటు హక్కును వినియోగించుకోలేదు.






ఓటు హక్కు వినియోగించుకుంటున్న ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్యే జోగులు, రేగిడి జెడ్పీటీసీ పాలవలస ఇందుమతి, పాలకొండ జెడ్పీటీసీ పాలవలస గౌరీపార్వతి

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు



రావాడ కూడలిలో వాహన తనిఖీలు చేస్తున్న ఆర్టీఓ, సిబ్బంది

కురుపాం: వాహనదారులు నిబంధలు పాటించకుంటే చర్యలు తప్పవని పార్వతీపురం మన్యం జిల్లా ఆర్టీఓ మల్లికార్జునరెడ్డి హెచ్చరించారు. కురుపాం మండల కేంద్రంలో సోమవారం వాహన తనిఖీలు చేపట్టారు. రోడ్డు ట్యాక్స్ చెల్లించకుండా వాహనాలు నడిపినట్లయితే 200 శాతం పెనాల్టీ వేయడం జరుగుతుందన్నారు. వాహనాలకు హైసెక్యూరిటీ నంబర్ ప్లేట్లు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఆటోల్లో పరిమితిని మించి ప్రయాణికులను ఎక్కిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఆయనతో పాటు ఇన్‌స్పెక్టర్ శశికుమార్, రమేష్‌కుమార్, సిబ్బంది ఉన్నారు.

ప్రకృతి సాగుతో పర్యావరణానికి మేలు



విత్తన గుళికల తయారీపై అవగాహన కల్పిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

భామిని: ప్రకృతి వ్యవసాయ విధానంలో పంటలు సాగు చేయడం వల్ల పర్యావరణానికి మేలు జరుగుతుందని ప్రకృతి వ్యవసాయం యాంకర్స్ పి.బాలు, ఎం.అంబోజీ, డి.శివప్రసాద్ అన్నారు. మండలంలోని బొడ్డగూడలో సోమవారం ప్రకృతిసాగుపై రైతులకు అవగాహన కల్పించారు. సుస్థిర వ్యవసాయ విధానం, భూ సంరక్షణ పద్ధతులు, ప్రీ మాన్‌సూన్ డ్రైసోయింగ్, విత్తన గుళికల తయారీ తదితర అంశాలను రైతులకు వివరించారు. నవధాన్యాల సాగుతో నేల సారవంతం అవుతుందన్నారు.

ఇంటర్మీడియట్ పరీక్షలకు ఏర్పాట్లు

భామిని: మండల కేంద్రంలోని ఏపీ మోడల్ స్కూల్, కాలేజీలో ఇంటర్మీడియెట్ పరీక్షల నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్, పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్ రఘుపాత్రుని శివకుమార్ సోమవారం తెలిపారు. ఈ నెల 15 నుంచి ప్రారంభమయ్యే ఇంటర్ పరీక్షల నిర్వహణపై సిబ్బందితో సమావేశమై పలు సూచనలు చేశారు. మాస్‌కాపీయింగ్‌కు అవకాశం లేకుండా సీసీ కెమెరాల నిఘా మధ్య పరీక్షలను పకడ్బందీగా నిర్వహించనున్నట్లు చెప్పారు. ఏపీ మోడల్ స్కూల్ పరీక్ష కేంద్రంలో భామిని ప్రభుత్వ జూనియర్ కాలేజీ, కేజీబీవీ, ఏపీడబ్ల్యూఎస్ గురుకులం, మోడల్ స్కూల్ నుంచి మొత్తం 578 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు చెప్పారు.